సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ¦ 15 ¦ డిసెంబర్ ¦ 2023



కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ తెలిపారు. IIలో



సమన్వయంతో పనిచేయాలి

సమన్వయంతో పనిచేసి సేవలందించాలని ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మురళి ఆదేశించారు. IIలో



రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

విశాఖ: ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవం జరుగుతుందని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

న్యూస్‌రీల్

విజృంభిస్తున్న చలి గాలులు

- వణుకుతున్న గిరి గ్రామాలు



పాడేరులో చలిమంటను కాగుతున్న ప్రజలు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి.కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.పొగమంచు కురుస్తుండడంతో పాటు సాయంత్రం నుంచే చలితీవ్రత నెలకొంటోంది. రాత్రి సమయంలో చలి వణికిస్తుండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. గురువారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 12డిగ్రీలు, అరకులోయలో 12.9డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని అధికారులు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

- గెడ్డలో పడి విద్యార్థి మృతి ఘటనపై చర్యలు
- విచారణ నిర్వహించిన ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

డుంబ్రిగుడ: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ రామును గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశాల మేరకు గురువారం సస్పెండ్ చేసినట్టు ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు తెలిపారు. ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి సంతోష్ గెడ్డలో దిగి మృతి చెందడం తెలిసిందే. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్టుగా ఆయన పేర్కొన్నారు. విద్యార్థి మృతి ఘటనపై గురువారం ఆయన ఆశ్రమ పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు



ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధి వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: అంగన్‌వాడీల సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళతామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రోడ్ షోలో భాగంగా రాజవొమ్మంగి వచ్చిన వారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి కె. వెంకటలక్ష్మి అందజేశారు.

సుమనోహారం





చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వికసించిన గ్లాడియోలస్ పూలు

అలంకరణ పూల సాగుకు కేరాఫ్‌గా చింతపల్లి ప్రాంతం మారనుంది. ఇక్కడ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మంచి దిగుబడులు వస్తున్నాయి. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో చేపట్టిన విస్తృత పరిశోధనల్లో మంచి దిగుబడులు సాధించారు. త్వరలోనే గ్లాడియోలస్ పూల రకాన్ని రైతులతో సాగు చేయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

- గ్లాడియోలస్ పూలసాగుకు అనుకూలించిన వాతావరణం
- పరిశోధనల్లో మంచి దిగుబడి
- ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం
- త్వరలో రైతులకు పరిచయం కానున్న సాగు
- చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెల్లడి

చింతపల్లి రూరల్ : అలంకరణ పూలు ఇప్పుడు మన్యంలో వికసిస్తున్నాయి. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గత రెండేళ్లుగా ప్రయోగాత్మకంగా చేపట్టిన గ్లాడియోలస్ పూలసాగు విజయవంతం కావడంతో త్వరలోనే రైతులతో చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

పర్యాటకులను ఆకర్షించేలా..

జిల్లాలో చింతపల్లి ప్రాంతానికి పర్యాటకంగా ప్రత్యేకంగా గుర్తింపు ఉంది. ఇక్కడికి సమీపంలో ఆంధ్రా కశ్మీర్‌గా పిలువబడే లంబసింగికి శీతాకాలంలో భారీగా పర్యాటకులు వస్తుంటారు. వీరంతా పరిసర ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఇందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో అలంకరణ పూలసాగుకు ఇక్కడి శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. ఇక్కడ వివిధ పూల రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. వీటిలో ప్రధానంగా గ్లాడియోలస్ మంచి దిగుబడి వస్తోంది. వీటి అందాలను తిలకించేందుకు పర్యాటకులు పరిశోధన స్థానాన్ని సందర్శిస్తున్నారు.

పుష్పగుచ్ఛాల తయారీలో..

అందమైన పుష్ప గుచ్ఛాల తయారీ, శుభకార్యాల్లో అలంకరణకోసం ఈ పువ్వులను విరివిగా వినియోగిస్తున్నారు. వీటిని ఉష్ణమండలం, సమశీతోష్ణ వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయవచ్చని సహ పరిశోధకుడు డాక్టర్ సుద్దాల వంశీకృష్ణ తెలిపారు. ఉష్ణోగ్రతలు 27 నుంచి 30 డిగ్రీల మధ్య ఉంటే మంచి పూల దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు. మన్యంలో తేలికపాటి నేలలు సాగుకు అనుకూలమని చెప్పారు. ఎక్కువ సేంద్రియ పదార్థం గల గుల్లబారిన నేలల్లో నాణ్యమైన పూల దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

అనుకూల రకాలు..

ఆర్కా ఆమర్, ఆర్కా తిలక్, ఆయుష్, ఆర్కా ప్రథమ్, ఎల్లోఫ్రిల్, సదాబహార్, దర్శన్, సిల్వియ, అరుణ్, కాజల్, వైట్ ప్రోస్పరిటీ రకాలు ఈ ప్రాంతంలో సాగుకు అనుకూలంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎకరాకు రూ.3.50 లక్షల పెట్టుబడి

ఎకరాకు సుమారు రూ.3.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. 44 వేల దుంపలు అవసరం. ఒక్కో దుంప రూ.6 ధర ఉంది. నాటిన తరువాత ఒక్కో దుపంకు రెండు నుంచి మూడు కాడలు వస్తాయి. మార్కెట్లో ఒక్కో కాడ ధర సీజన్‌ను బట్టి రూ.6 నుంచి రూ.10 వరకు ధర ఉంది. రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

- ఒక్కసారి దుంప నాటితే 70 నుంచి 70 రోజుల్లో దిగుబడి వస్తుంది. పంట కాలం ముగిసిన తరువాత దుంపను సేకరించి నీడ ప్రాంతంలో నిల్వ చేసుకోవాలి. అప్పటి నుంచి మూడు నెలలు నిద్రావస్థలో ఉంటాయి. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మధ్య నాటుకోవాలి.
- బెంగళూరు నుంచి దుంపలు తీసుకువచ్చి 20 సెంట్లలో సాగు చేపట్టారు.
- పరిశోధన స్థానంలో ఆరుబయట ఊదా, ఆరంజ్, పింక్, తెలుపు రకాలు మంచి దిగుబడి నిచ్చాయి.

గ్లాడియోలస్‌తో మంచి ఆదాయం



గంజాయి పంటకు ప్రత్యామ్నాయంగా పూలసాగును పరిచయం చేసే దిశగా పరిశోధనలు ప్రారంభించాం. రెండేళ్లుగా జరుగుతున్న పరిశోధనల్లో గ్లాడియోలస్ పూలు మంచి దిగుబడి వచ్చాయి. ఈ సాగు చేపట్టడం వల్ల మంచి రైతులు మంచి ఆదాయం పొందవచ్చు. ఉష్ణోగ్రతలు 27 నుంచి 30 డిగ్రీల మధ్య ఉన్నచోట ఈ సాగు చేపట్టవచ్చు.

– డాక్టర్ సురేష్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రి అమర్‌నాథ్

గోపాలపట్నం (విశాఖ): శ్రీకాకుళం జిల్లా పర్యటన నిమిత్తం గురువారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన ఆయన 9.13 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. సీఎంతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని విశాఖ వచ్చారు. ఇక్కడి నుంచి 9.27 గంటలకు సీఎం జగన్ హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరారు. ఆయన వెంట మంత్రులు బూడి ముత్యాలనాయుడు, విడదల రజని ఉన్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 5.13 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడ నుంచి 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఇటీవల మిచాంగ్ తుపానుకు పంట నష్టపోయిన ప్రతి బాధిత రైతుకు న్యాయం చేసే విధంగా పంట నష్టాన్ని సక్రమంగా గణన చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. 8లో

31 మందికి వైద్య సేవలు

- శిశుమరణాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం
- కిలుములు, బల్లపురాయిలో వైద్యశిబిరం ఏర్పాటు



కిలుములు గ్రామంలో వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీడీవో విగ్గిన్స్, వైద్యాధికారి సత్యశ్రీ

పెదబయలు: మండలంలోని పెదబయలు పీహెచ్‌సీ పరిధిలోని లక్ష్మీపేట పంచాయతీ కిలుములు, బల్లపురాయి గ్రామాల్లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శిశు మరణాలు సంభవించిన నేపథ్యంలో శిబిరం ఏర్పాటుచేశామని వైద్యాధికారి సత్యశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన శిశువులకు సంబంధించి వారి తల్లిదండ్రులతో వైద్యాధికారి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత నెలలో కిలుములు గ్రామంలో మూడు నెలల నుంచి ఏడాది వయసు కలిగిన ముగ్గురు శిశువులు మృతి చెందారని,ఇదే నెలలో బల్లపురాయి గ్రామంలో మరో చిన్నారి మృతి చెందారని, ఈ నెల 12తేదీన ముంచంగి సీలమ్మ, శ్రీనుకు చెందిన మూడు నెలల మగశిశువు మృతి చెందినట్టు తెలిపారన్నారు. కడుపు ఉబ్బడంతో పాటు జీర్ణం కాక వంటి లక్షణాలతో మృతి చెందినట్టు తల్లిదండ్రులు చెప్పారని వైద్యాధికారి పేర్కొన్నారు. పిల్లలను పడుకోబెట్టి పాలు పెట్టరాదని కూర్చొని మాత్రమే పాలు పెట్టాలని వైద్యాధికారి బాలింతలకు సూచించారు. గ్రామంలోని బాలింతలు, చిన్నారులను పరీక్షించారు. పిల్లల ఆరోగ్యం ఏమాత్రం బాగులేకపోయినా వెంటనే ఆస్పత్రికి తరలించాలని వైద్యాధికారి సూచించారు. ఇక నుంచి పిల్లలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా సమాచారం అందించాలని స్థానిక ఆశ కార్యకర్త, ఏఎన్ఎంతో అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. రెండు గ్రామాల్లో మూ దు రోజుల పాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. వైద్యశిబిరంలో 31 మందికి సేవలు అందించారు. శిశు మరణాలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వైద్యాధికారి పేర్కొన్నారు. ఇలావుండగా ఎంపీడీవో విగ్గిన్స్ శిశుమరణాల వివరాలను గ్రామస్తుల నుంచి తెలుసుకున్నారు.

మన్యంలో సీతాలు పండగ సందడి

- ధాన్యం రాశికి పూజలు
- విందు భోజనాల ఏర్పాటు



పాడేరు మండలం తామరాపల్లి గ్రామంలో ధాన్యం రాశికి పూజలు చేస్తున్న గిరిజనుడు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని గిరిజన రైతులు సంప్రదాయ సీతాలు పండగలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూర్పులు పూర్తి చేసిన అనంతరం సీతాలు పండగను నిర్వహిచడం ఆనవాయితీ. దీనిలో భాగంగానే నూర్పిడి పూర్తయిన వెంటనే ధాన్యాన్ని ఒకచోట కుప్పగా పోసి వాటికి గిరిజన సంప్రదాయ ప్రకారం పూజలు చేశారు. ప్రకృతి దేవుళ్లను పూజించి అదే ప్రాంతంలో నాటుకోళ్లు బలి ఇచ్చి వాటితోనే విందు భోజనాలు ఏర్పాటుచేశారు. పండిన ధాన్యాన్ని రాసులుగా పోసి వాటికి పూజ అనంతరం తొలిగంప ధాన్యాన్ని ఇల్లాలుతో ఇంటికి తరలించి దేముడు మూలన ఏర్పాటుచేశారు. పాడేరు మండలం వనుగుపల్లి, తుంపాడ, వంతాడపల్లి, హుకుంపేట మండలం రంగశీల పంచాయతీల పరిధిలో గురువారం సీతాలు పండగను ఘనంగా నిర్వహించారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్న



వైఎస్సార్‌సీపీ వాహన యాత్రలో భాగంగా రాజవొమ్మంగిలోని అల్లూరి జంక్షన్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్
- వాహన యాత్రకు విశేష స్పందన
- ఒట్టిగెడ్డ నుంచి ప్రారంభం
- అడుగడుగునా ఘన స్వాగతం

రాజవొమ్మంగి: రాష్ట్రంలోని సంక్షేమపాలనతో జగనన్న ఎంతో మంది పేదల ఆకలితీర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఒట్టిగెడ్డ వద్ద రోడ్‌షోను ప్రారంభించారు. వీరికి ప్రజలు, అభిమానులు అఖండ స్వాగతం పలికారు. క్రేన్ సాయంతో గజమాల వేసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షపాతి అన్నారు. సంక్షేమ పథకాల రూపంలో పేదలకు రూ.వేల కోట్లను వెచ్చించారన్నారు. నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. మండలంలో లబ్ధి పొందిన వారి వివరాలను చదివి వినిపించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయానికి ప్రభుత్వం కేటాయించిన రూ. 40 లక్షలతో ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి బ్రోచర్లను పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో కూడా జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీకే మద్దతు పలకాలని, ప్రజలను ఓటు అడిగే హక్కు తమ పార్టీకి మాత్రమే ఉందని వారు పేర్కొన్నారు. వాహనయాత్ర దూసరపాము, రాజవొమ్మంగి, కొండపల్లి, శరభవరం మీదుగా రింగ్ రోడ్డులోని గ్రామాలను కలుపుకొంటూ లబ్బర్తి చేరుకుంది. వందల కొద్ది వాహనాలతో సాగిన ఈయాత్ర పొడవునా బాణసంచా కాల్పులు, డప్పుల వాయిద్యాల నడుమ ప్రజల నుంచి అఖండ స్వాగతం లభించింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీపై పూల వర్షం కురిసించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌లు ఆగూరి శుభలక్ష్మి, చీడి శివ, కొంగర మురళీకృష్ణ, బూసరి సత్యనారాయణ, భీంరెడ్డి శుభలక్ష్మి, మిరియాల గణలక్ష్మి, మిరియాల సత్యవతి, ఎంపీటీసీలు కనిగిరి గంగదుర్గ, చంద్రు లోవ లక్ష్మి, ఆవుగడ్డ నిర్మలాదేవి, సీఐ స్వామి నాయుడు, ఎస్ఐ రఘునాథరావు, స్పెషల్‌బ్రాంచ్ పోలీసులు పాల్గొన్నారు.

మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

విద్యార్థులకు ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి



విద్యార్థినుల థింసా నృత్యం



సీలేరులో స్టాక్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

చింతపల్లి రూరల్: బాగా చదువుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన స్థానిక ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యార్థులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 1300 విజిట్‌లు చేసినట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు ,పాఠశాలల్లో అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోపాలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పోర్టుఫైడ్ బియ్యంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటి విషయంలో అపోహ వద్దన్నారు. ఫుడ్ కమిషన్ డీడీ సురేష్, డీఎస్‌వో శ్యాంప్రకాష్, ఏఎస్‌వో శ్రీహరి, డీఎం గణేష్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ అన్నామణి, ఎంఈవోలు ప్రసాద్, నాయుడు, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

సీలేరు: చదువులో మైదాన ప్రాంతాల విద్యార్థులతో సమానంగా పోటీపడేలా మన్యంలో గిరిజన విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జీకే వీధి మండలం సీలేరు, ధారకొండ, సప్పర్ల పంచాయతీల్లోని బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని వండి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గాను అందుకు అవసరమైన పూర్తిస్థాయిలో వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అందుకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

జిల్లాలో కొన్ని వసతి గృహాల్లో మెనూ ప్రకారం ఆహారం అందించలేదన్నారు. చికెన్ పంపిణీలో తేడాలను గుర్తించామన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశామన్నారు. ప్రభుత్వం పథకాలు కింది స్థాయి వరకు సక్రమంగా అందడంలో కొన్ని పొరపాట్లు జరుగుతున్నాయని వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీలేరు జీసీసీ డిపోను ఆయన తనిఖీ చేశారు. ప్రతినెలా బియ్యం తక్కువగా రావడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ దుర్గో,ఉప సర్పంచ్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వాటిని పరిష్కరిస్తామని చెబుతూ పూర్తి వివరాలను అందించాలని డిప్యూటీ తహసీల్దార్ కుమార్ స్వామిని ఆదేశించారు. ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, వార్డెన్ నాగ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థి మృతి

- పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మృతదేహంతో ఆస్పత్రి బయట ఆందోళన
- న్యాయం చేస్తామని ఐటీడీఏ పీవో హామీతో విరమణ



జిల్లా ఆస్పత్రి వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

పాడేరు రూరల్ : అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గిరిజన విద్యార్థి మృతి చెందిన ఘటన ఆందోళనకు దారి తీసింది. వివరాలిలా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ అరబీరు గ్రామానికి చెందిన జనం అరుణ్‌కుమార్ అనే గిరిజన విద్యార్థి ముంచంగిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల–1లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం అతను అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పాఠశాల యాజమాన్యం సమీపంలో ఉన్న సామాజిక ఆస్పత్రిలో చేర్చి వైద్యసేవలు అందించారు. అయితే అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో బుధవారం సాయంత్రం పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమన్యం నిర్లక్ష్యమే కారణామని ఆరోపించారు. గతంలో కూడా తమ మరో కుమారుడు ఆశ్రమ పాఠశాలలో చదువుతూ మృతి చెందాడని, తమకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో సీఐ సుధాకర్ ఆదేశాల మేరకు ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, గిరిజన సంఘాలతో మాట్లాడారు. ఐటీడీఏ పీవో అభిషేక్‌తో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనర్స, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాలికి లక్కు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు కొమ్మా పృధ్వీరాజ్, బత్తిరి నరేష్, సింహాద్రి, తల్లిదండ్రులు చర్చలు జరిపారు. విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుని న్యాయం చేస్తామని ఐటీడీఏ పీవో అభిషేక్ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

రొయ్య పిల్లలు పంపిణీ


రొయ్య పిల్లలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

రంపచోడవరం: ఏజెన్సీలో చెరువుల్లో చేపల సాగుచేస్తున్న గిరిజనులకు జన్యుపరంగా అభివృద్ధి చేసిన రొయ్య పిల్లలను అందజేసినట్టు కెవీకె కో–ఆర్డినేటర్ డాక్టర్. లలితాకామేశ్వరి అన్నారు. కెవీకెలో గిరిజనులకు 40వేల రొయ్య పిల్లలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవీకె మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర సంస్థ సీఐఎఫ్ఏ(భువనేశ్వర్) జన్యుపరంగా అభివృద్ధి పరిచిన రొయ్య పిల్లను గిరిజనులు చెరువులో సాగు చేసేందుకు అందజేసినట్టు చెప్పారు. ఎకరానికి చేపలతో కలిపి 4–6వేల రొయ్య పిల్లలను చెరువులో వేసుకోవచ్చన్నారు. కేవలం రొయ్యలే సాగు చేయాలనుకుంటే 15–20 వేల వరకు వేసుకోవచ్చన్నారు. రొయ్యల సాగుతో అధిక ఆదాయం సమకూర్చుకోవచ్చున్నారు.

కలప తరలిస్తున్న కారు పట్టివేత


అటవీ అధికారులు పట్టుకున్న ఇన్నోవా వాహనంలోని కలప

అడ్డతీగల : అడ్డతీగల మండలం డి.కొత్తూరు వద్ద అక్రమంగా కలప తరలిస్తున్న ఇన్నోవా కారుని అడ్డతీగల అటవీ అధికారులు గురువారం పట్టుకున్నారు. రెండు ఆరు ఆరు సైజు మంచాలు (టేకు, ఇరుగుడు చేవ రకాలు) ఇన్నోవాలో వేసుకుని వెళ్తుండగా పట్టుబడ్డారు. కొయ్యూరు మండలం రేవళ్ల నుంచి రాజమహేంద్రవరం తరలిస్తుండగా అటవీ అధికారులు డి.కొత్తూరు వద్ద ఆపి తనిఖీ చేయగా కలపను గుర్తించి కలపతో పాటు ఇన్నోవా వాహనాన్ని అడ్డతీగల అటవీ కార్యాలయానికి తరలించారు. కాగా పట్టుకున్న కలప విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని కేసు నమోదు చేసి ఇన్నోవా వాహనాన్ని సీజ్ చేసినట్టు అడ్డతీగల సెక్షన్ డీఆర్వో రాజారావు తెలిపారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన అవసరం


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


హాజరైన పలు రాజకీయ పార్టీల నేతలు,అధికారులు

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఈవీఎంల వినియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఈవీఎంల వినియోగంపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల వినియోగంపై గ్రామాల్లో ఓటర్లకు తెలియజేయాలన్నారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్‌ల పనితీరుపై ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలకు అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. అనంతరం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్‌ల పనితీరుపై కలెక్టర్‌తో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.అంబేద్కర్, ఎస్‌డీసీ మురళి పాల్గొన్నారు.

పాడేరు ఐటీడీఏలో..

పాడేరు రూరల్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ వినియోగంపై అవగాహన కల్పించారు. జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాస్ ఓటు హక్కు నమోదు, ఓట్ల లెక్కింపుపై వివరించారు. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాలలో ఓటు హక్కు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శిక్షణ, అవగాహన నిమిత్తం జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ఆరు ఈవీఎం యంత్రాలను కేటాయించామన్నారు. ఈ యంత్రాలతో గ్రామాల్లోకి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణకు కేటాయించిన యంత్రాలకు తగిన భద్రత కల్పించాలని ఆదేశించారు.గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి, పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- త్వరితగతిన పంటకోత ప్రయోగాలు చేపట్టాలని ఆదేశం

సాక్షి,పాడేరు: ఇటీవల మిచాంగ్ తుపానుకు పంట నష్టపోయిన ప్రతి బాధిత రైతుకు న్యాయం చేసే విధంగా పంట నష్టాన్ని సక్రమంగా గణన చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.గురువారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, వ్యవసాయాధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ,ఉద్యానవన సహాయకులంతా తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి నష్టాలను సమగ్రంగా రూపొందించాలన్నారు. మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ప్రతి రోజు గ్రామ సహాయకులతో సమావేశమై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో పంటకోత ప్రయోగాలు నలభై శాతమే జరిగాయని, మిగిలిన 60శాతం వెంటనే పూర్తి చేసి తమసకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పంట కోత ప్రయోగాల ద్వారా రైతులకు క్రాప్ బీమాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందన్నారు.నిర్దేశించిన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లకు చేరవేయాలని ఆదేశించారు. రంగుమారిన ధాన్యాన్ని గుర్తించి రైతులు నష్టపోని విధంగా మిల్లర్లతో ప్రత్యేకంగా చర్చించి వాటిని కొనుగోలు చేసే విధంగా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాగుల కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని ముంపు గ్రామాల పరిధిలోను పంట నష్టాలను గణన చేసి తమకు నివేదించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈనెల 18వతేది వరకు పంట నష్టాలపై గణన చేసి, 21వ తేదీ వరకు సామాజిక తనిఖీలు, 26వతేదీన పంట నష్టం తుది జాబితాను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా సెక్టార్ అధికారులు పనిచేయాలని, సజావుగా ఎలక్షన్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శుభం బన్సాల్ చెప్పారు.రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో గురువారం ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించి 59 మంది సెక్టార్ అధికారులను, సెక్టార్ ఇన్‌స్పెక్టర్లను నియమించామన్నారు. ఈవీఎం, వీవీ ప్యాడ్ మిషన్ల పనితీరును వివరించారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ సెక్టార్‌కు పోలీస్ అధికారిని నియమించినట్టు తెలిపారు.ఎన్నికల డీటీ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎన్నికల సీనియర్ సహాయకులు ఇందిరాబాయి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

సమన్వయంతో పనిచేయాలి

చింతపల్లిరూరల్: సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు సమన్వయంతో కలసికట్టుగా పనిచేయాలని ఏపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మురళి అన్నారు. మండలకేంద్రంలో గురువారం చింతపల్లి, జీ.కే.వీధి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నిర్వహించిన రిఫ్రేషర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీమ్ వర్క్ చేయడం వలన నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసుకోవచ్చన్నారు. సమష్టిగా పనిచేసి నూరుశాతం ప్రగతి సాధించవచ్చన్నారు. పని ఒత్తిడి అధిగమించే అంశాలను వివరించారు. సిబ్బంది ప్రతి ఒక్కరు కమ్యూనికేషన్ స్కిల్‌ను కలిగి ఉండాలన్నారు. ఎంపీపీ అనూషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో ఆశాజ్యోతి, ట్రైనింగ్ మెనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

గంగవరం : అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉన్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, తల్లులకు, గర్భిణులకు పోష్టకాహారం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు గంగవరం ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను గ్రామ సచివాలయ సిబ్బందితో తెరిపించారు. పౌష్టికాహార పంపిణీకి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని సీడీపీవో తెలిపారు. గ్రామసచివాలయ సిబ్బంది, తల్లుల కమిటీల ఆధ్వర్యంలో పౌష్టికాహార పంపిణీ చేపట్టామన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

సాక్షి,పాడేరు: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జీసీసీ ఎండీ జి.సురేష్‌కుమార్ తెలిపారు. పెదబయలులో జీసీసీ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. అలాగే పెదబయలు మండలం లబ్బిరి, ముంచంగిపుట్టు మండలం ముక్కిపుట్టు గ్రామాలకు చెందిన కాఫీరైతులకు టార్పాలిన్లను ఆయన పంపిణీ చేశారు. బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ కాఫీ ఫెస్టివల్‌లో ఇండియాలో బెస్ట్ కాఫీ గింజల అవార్డు పొందిన పెదబయలు మండలానికి చెందిన అశ్వినును ఆయన సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కాఫీ రైతులకు జీసీసీ నాణ్యమైన తూకంతో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. జీసీసీ పాడేరు డీఎం జి.సింహాచలం, ముంచంగిపుట్టు, పెదబయలు బ్రాంచిల మేనేజర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట

- పెండింగ్ పనులు నెలరోజుల్లో పూర్తి చేయాలి
- రూ. 7.20 కోట్లతో పనులకు ప్రతిపాదనలు
- అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయటౌన్: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన అరకులోయ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ కార్యలయంలో గురువారం అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ఇప్పటి వరకు చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్‌లు, బీటీ రోడ్లు, తదితర పనులపై సమీక్ష నిర్వహించి, వాటి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న పనులన్నీ నెల రోజుల్లో పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో కోట్లాది రూపాయాలు వెచ్చిస్తున్నా, పనుల్లో ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారని ప్రశ్నించారు, ఆయన మాట్లాడుతూ స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ నిధులతో మారుమూల పెదబయలు పవంచాయతీ కుంతుర్ల – బంట్రోత్ పూట్ రహాదారి రూ. 2 కోట్లతో బిటీ రోడ్డు, ముంచంగిపుట్టు నుంచి వెచ్చంగిపుట్టు వరకు రూ. 2 కోట్లు, పెదకోటపాడు– జర్రిపాడు రహదారికి రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో వచ్చిన వినతలను పరిగణలోకి తీసుకొని సీసీ రోడ్లు, మరుగుదోడ్లు, ప్రహారీలు, మెటల్ రోడ్లు ఎన్ఆర్ఈజీఎస్ నిదులు రూ.7.20 కోట్లతో ప్రతిపాదలను తయారు చేశామన్నారు. అనంతగిరి మండలంలో 17 పనులు, అరకులోయలో 8, డుంబ్రిగుడలో–19, హుకుంపేటలో–22, పెదబయలులో–14, ముంచంగిపుట్టులో–16 పనులకు సంబంధించి కలెక్టర్‌కు ప్రతిపాదలను పంపించామన్నారు.

రూ.43.52కోట్లతో సచివాలయ భవనాలు

పీఆర్ డీఈఈ రామమ్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో మొత్తం 115 సచివాలయ భవనాలకు రూ. 43 కోట్ల 52 లక్షల 40వేలతో పనులు ప్రారంభించామన్నారు. వీటిలో 109 భవనాల పనులు ప్రారంభించామన్నారు. వీటిలో 27 భవనాలు ప్రారంబోత్సవం చేశామన్నారు. 10 భవనాలు చివరి దశలో ఉన్నాయని, 43 భవనాలు రెండో శ్లాబ్ వేశామని, 19 భవనాలు మొదటి శ్లాబ్ వేశామని, 10 భవనాలు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. 115 ఆర్‌బీకేలకు 101 ఆర్‌బికేలు పనులు ప్రారంభించి 27 భవనాలు ప్రారంభించామన్నారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 47 హెల్త్ సెంటర్‌లో మూడు ప్రారంభించామని, 44 భవనాలు నిర్మాణ దశలో ఉన్నట్టు తెలిపారు. రహాదారులు, మరుగుకాలువలు, ఇతర 246 పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఏఈ ఎస్.గోపీకృష్ణ, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసి సంపత్ కుమార్, నాయకులు రామారావు, బాలరాజు, నాయక్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ

వాగులు, గెడ్డలు దాటి...

- శివారు పాఠశాలల్లో ఎంఈవో కృష్ణమూర్తి తనిఖీలు


చీపురుగొంది వాగు దాటుతున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ, బూసిపుట్టు పంచాయతీల్లో గురువారం ఎంఈవో కృష్ణమూర్తి పాఠశాలల తనిఖీల్లో భాగంగా వాగులు దాటి, కాలినడకన వెళ్లారు. కెందుగూడ, ముక్కిపుట్టు, సిర్లిమెట్ట, దిగువకుమడ, చీపురుగొంది, పిట్టగెడ్డ, డెంగాగూడ పాఠశాలలకు అతి కష్టం మీద ఎంఈవో వెళ్లి ,విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యం, వర్కుబుక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు.రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సూర్యనారాయణ ,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

ఐటీడీఏ కాలనీలో కలప డిపో ఏర్పాటు


ఐటీడీఏ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కలప డిపో

కొయ్యూరు: విశాఖ జిల్లాగా ఉన్నంత వరకు ఇక్కడ పట్టుబడిన కలపను గొలుగొండ కలప డిపోకు తరలించేవారు. అల్లూరి జిల్లాగా మారిన తరువాత రేంజ్ కూడా పెదవలసగా మారింది. దీంతో మొదట్లో కలపను 70కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లికి తరలించేందుకు ఇబ్బంది పడేవారు. సమస్యను అధిగమించేందుకు పీవో అభిషేక్ కొయ్యూరు మండల కేంద్రంలోని ఐటీడీఏ కాలనీలో డిపో ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దీనిపై కొయ్యూరు సెక్షన్ అధికారి సింహాద్రి మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కలప డిపోను ఐటీడీఏ కాలనీలో ఏర్పాటు చేశామన్నారు.

జగనన్నకు చెబుదాంకు విశేష స్పందన

36 వినతుల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో గురువారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 36 వినతులను స్వీకరించినట్టు జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, పలు ఇంజనీరింగ్ విభాగాల ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, లీలాకృష్ణ, బాలసుందర బాబు, లీడ్‌బ్యాంకు మేనేజర్ రవితేజ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పెళ్లి కానుక ప్రోత్సాహకం మంజూరు చేయాలని అనంతగిరి మండలం జాలాడా గ్రామానికి చెందిన ఆర్.లక్ష్మణరావు విన్నవించుకున్నారు.
- తమ భూములను రీసర్వే చేయాలని ముంచంగిపుట్టు మండలం మాకవరం గిరిజనులు పి.జగతి,పాంగి బొల్లిలు వినతి పత్రం అందజేశారు.
- తన కుమారుడు విష్ణు మానసిక ఎదుగుదల లోపంతో బాధపడుతున్నాడని సామాజిక పింఛను మంజూరు చేయాలని పెదబయలు మండలం చెక్కరాయికి రేగం చంటిబాబు కోరాడు.
- తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని జి.మాడుగుల మండలం కె.గొందివీధి గ్రామానికి చెందిన కె.సింహాచలం, సత్యారావు విన్నవించారు.
- ముంచంగిపుట్టు మండలంలోని మాలగుమ్మి జంక్షన్ నుంచి బాదిపుట్టు గ్రామం వరకు మూడు కిలో మీటర్ల రోడ్డు నిర్మించాలని బంగారుమెట్ట సర్పంచ్ వంతాల రత్నం అధికారులను కోరారు.


గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

అంగన్‌వాడీ సిబ్బంది తీరుపై ధ్వజం


తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: క్రమం తప్పకుండా పిల్లలకు తల్లులకు పౌష్టికాహారం అందించాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వారికి మూడు రోజులుగా పస్తులు వుంచడం సమంజసం కాదని రాజవొమ్మంగి సీడీపీఓ దేవమణి పేర్కొన్నారు. కలెక్టర్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ ఆదేశాల మేరకు ఆమె రాజవొమ్మంగిలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులున్నారు. మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తెరవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ యూనియన్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. అయితే ఆందోళనకారులు తిరిగి అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేయడం గమనార్హం.

వసతి గృహాల్లో కట్టుదిట్టమైన భద్రత


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఎంపీపీ కూడా రాజుబాబు గురువారం సందర్శించారు. వసతి గృహాల్లో ఎటువంటి అల్లర్లు లేకుండా కట్టుదిట్టమైన భద్రతను అధికారులు కల్పించాలన్నారు. వసతి గృహాల్లో వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని, వసతి గృహాల్లో పరిశుభ్రత లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు, బయట వ్యక్తులకు ప్రవేశం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వారానికి రెండు సార్లు వైద్య సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించాలని సూచించారు. డిప్యూటీ డీఈవో సోమేలి చెల్లయ్య, ఎంఈవో ఈశ్వరరావు, వార్డెన్ కన్యాకుమారి తదితరులున్నారు.

తండ్రి రుణం తీర్చుకుంది..


తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నవ్య

కశింకోట: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది. కశింకోటలోని గవరపేటలో ఈ ఘటన జరిగింది. భూముల కొనుగోలు, అమ్మకాల్లో మధ్యవర్తిత్వంతో జీవనం సాగిస్తున్న వేగి వెంకటరావు (60) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కుమారులు లేరు. నవ్య, మంజు అనే ఇద్దరు కుమార్తెలు, భార్య సత్యవతి ఉన్నారు. పెద్ద కుమార్తె నవ్య తండ్రికి స్థానిక సాధుమఠం శ్మశాన వాటికలో తలకొరివి పెట్టి అంతిమ సంస్కారం జరిపింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి తండ్రికి అంతిమ వీడ్కోలు పలికింది.

17న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు

తుమ్మపాల: గవరపాలెంలోని వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో ఈ నెల 17న మిస్టర్ ఆంధ్రా–2023 రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్, మెన్‌ఫిజిక్ పోటీలు జరగనున్నట్లు పట్టణ బాడీ బిల్డర్స్, ఫిట్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎ.కృష్ణాజీ, ఎస్.బాబి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జిల్లా ఏర్పాటైన తర్వాత పట్టణంలో మొదటిసారిగా నిర్వహించే ఈ పోటీల్లో మిస్టర్ ఏషియా (మాల్దీవ్), మిస్టర్ వరల్డ్ (థాయిలాండ్), మిస్టర్ ఇండియా (పంజాబ్), ఎన్.ఎం.నాయుడు (ఇండియన్ ఆర్మీ) పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథులుగా డైట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ఒలింపియన్ ఎం.మాణిక్యాలు, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ హాజరవుతారన్నారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి


ఘటనాస్థలిలో ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

అనకాపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో అక్కిరెడ్డి శ్రీను(31)అక్కడిక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు కథనం మేరకు వివరాలు. మండలంలో గొలగాం పంచాయతీ, కొత్తతలారివానిపాలెం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి శ్రీను ట్రాకర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీను గృహానికి కావాల్సిన ఇటుకల నిమిత్తం కొండుపాలెం వెళ్తుండగా అనకాపల్లి – సబ్బవరం సర్వీస్ రోడ్డులో మండలంలో కోడూరు జాతీయ రహదారి బ్రిడి మలుపులో ట్రాక్టర్‌ను టిప్పర్‌లారీ ఢీకొనడంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి భార్య అక్కిరెడ్డి వెంకట సౌమ్యశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతునికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య సౌమ్యశ్రీ ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి.